ప్రజాశక్తి

సోమవారం 23 డిసెంబర్ 2024 5

పార్వతీపురం మన్యం

## నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - భామిని

పత్తి కొనుగోలు కేంద్రం స్థానిక ఎఎంసి గోడౌన్‌లో సోమవారం ప్రారంభించనున్నట్లు పాలకొండ ఎఎంసి కార్యదర్శి వారణాసి సతీష్‌కుమార్ తెలిపారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని పాలకొండ ఎంఎల్‌ఎ నిమ్మక జయకష్ణ, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక ప్రారంభిస్తారని తెలిపారు. పత్తి రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని ఎఎంసి ఎడి ఐ.గంగాధర్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినదుకు ఈప్రాంత పత్తి రైతులు అభినందనలు తెలిపారు

# ఏజెన్సీలో చలి పులి

## పడిపోయిన ఉష్ణోగ్రతలు

## చాలీచాలని మంచాలతో కటిక నేలపైనే విద్యార్థుల బస

చలికాగుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతుంది. దీంతో ఉదయం 8 గంటలైనా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ఈ వారం రోజుల్లో మరింత చలి తీవ్రత ఎక్కువ కావడంతో వృద్ధులు, పిల్లలు చలికి తట్టుకోలేకపోతున్నారు. మరోవైపు చలితోపాటు ఇటీవల మూడురోజుల పాటు కురిసిన వర్షాలకు మరింత చలి తీవ్రత పెరగడంతో తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవడంతో కొండశివారున గల ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత పెరిగింది. ఉదయం 8గంటలతే అయితే తప్ప సూర్యుడు ఉదయించడం లేదు. మధ్యాహ్నం 3గంటలయ్యే సరికి చలి పెరిగిపోతుంది. మరోవైపు చల్లగా చలిగాలి ఉదయాన్నే మంచు దుప్పటిగా కొండంత కమ్మేస్తుంది. ఒకరి ముఖం ఒకరికి కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మన్యంలో చలితో ఎముకలు కొరికేసిన చలి వల్ల వృద్ధులు, పిల్లలకు నిద్ర పట్టక రాత్రులు జాగారం చేసే పరిస్థితి నెలకొంది.

వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. కొన్ని పాఠశాలల్లో దుప్పట్లో, కార్పెట్లు ప్రభుత్వం సరఫరా చేసినప్పటికీ చలి ధాటికి అవి కాయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఐదేళ్ల క్రితం గురుకుల, ఆశ్రమ పాఠశాలలకు మంచాలు సరఫరా చేసినప్పటికీ ప్రస్తుతం అవి సరిపడకపోవడంతో కొంతమంది విద్యార్థులు కటిక నేలపైనే పడుకోవాల్సి వస్తుంది. సీతంపేట బాలుర గురుకుల కళాశాలలో మంచాలు చాలక పోవడంతో కేవలం సెకండియర్ విద్యార్థులు మాత్రమే మంచాలపై పడుకుంటున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులంతా నేలపైనే పడుకుంటున్నారు. అలాగే సీతంపేట బాలుర గురుకుల పాఠశాలలో ఐదు నుండి పదవ తరగతి వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ 5,10 తరగతి విద్యార్థులకు మంచాలు లేకపోవడంతో వారు నేలమీద పడుకుంటున్నారు. 6,7,8,9 తరగతుల విద్యార్థులు మంచాలపై పడుకుంటున్నారు. అయితే మరో పక్క మంచాలు ఉన్న దానికి సరిపడా అదనపు భవనాలు లేకపోవడంతో మంచాలు ఉన్నా ప్రయోజనం లేదన్నట్టుగా ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత చలికాలంలో ప్రభుత్వం పాఠశాలలకు మంచాలు ఉంటే బాగుంటుందని పలువురు గిరిజన సంఘాలు కూడా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి గతంలో పాఠశాలలకు మంచాలు పంపిణీ చేయగా, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. మరోపక్క సీతంపేట బాలుర గురుకుల పాఠశాల శిథిలావస్థలో ఉండటంతో ఇక్కడ విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మైదాన ప్రాంతం నుండి పోలిస్తే ఏజెన్సీలో చలి అధికంగా ఉంటుంది. దీనికి తగ్గట్టుగా ప్రభుత్వమే విద్యార్థులకు ప్రత్యేకంగా మంచాలు, రగ్గులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే ఈ ప్రాంతంలో చలి తీవ్రత పెరగడంతో గిరిజనులు కూడా రగ్గులు, స్వెటర్లు వంటి ఉన్ని వస్త్రాలు ధరించి చలి నుంచి రక్షించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

నేలపై నిద్రిస్తున్న సీతంపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు

# సంక్షోభంలో గిరిజన విద్యాబోధన

- నెల రోజులుగా సమ్మెలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు
- డెప్యుటేషన్‌పై వెళ్లేందుకు ఆశ్రమ టీచర్ల నిరాకరణ
- తరుముకొస్తున్న పరీక్షలతో విద్యార్థుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన విద్య తీవ్ర సంక్షోభంలో ఉంది. ప్రభుత్వ అస్తవ్యస్త, అనాలోచిత నిర్ణయాల వల్ల గిరిజన విద్య సంకట స్థితిలో పడింది. ఫలితంగా వేలాదిమంది గిరిజన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తుపై వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నెలరోజులుగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెలో ఉన్నారు. రాష్ట్రంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు కన్నా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులే ఎక్కువ మంది. తమ ఉద్యోగాలను డిఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ నెల రోజుల నుంచి వారు నిరసన దీక్షలు చేపడుతున్నారు. 15 నుంచి 20 ఏళ్ల వరకు పని చేస్తున్న తమ పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిపై వారు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఉద్యోగభద్రత కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని భావిస్తూ సమ్మెలో కొనసాగుతున్నారు. నెలరోజులుగా సమ్మెలో ఉన్నందున ఆ పాఠశాలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువులు అటకెక్కిపోయాయి. ఉన్న కొద్దిమంది రెగ్యులర్ ఉపాధ్యాయులతో గురుకుల పాఠశాల, కళాశాలలను నెట్టుకొస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. గురుకుల ఉపాధ్యాయుల సమ్మె కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అదనంగా ఉన్న సబ్జెక్టు టీచర్లను గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో డెప్యుటేషన్‌పై నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి 72మంది ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై విజయనగరం,

దీక్షల్లో పాల్గొన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

విశాఖపట్నం జిల్లాలకు పంపిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరిలో 33 మంది మాత్రమే వారికి కేటాయించిన పాఠశాల, కళాశాలల్లో చేరారు. మిగిలిన వారు డెప్యుటేషన్‌పై వెళ్లడానికి నిరాకరిస్తున్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు. ప్రభుత్వ మొండివైఖరి కారణంగా అటు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ, ఇటు గురుకుల పాఠశాల, కళాశాలల్లో విద్యాబోధన అటకెక్కిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గిరిజన విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి తల్లిదండ్రులు కూడా కలత చెందుతున్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమ్మెకు మద్దతు తెలియజేయడానికి సిద్ధమవుతున్నారు. వీరి దీక్షలకు ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజాసంఘాలు సంఘీభావం తెలుపుతున్నాయి.

మరో మూడు నెలల్లో పది, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఇంతవరకు సిలబస్ పూర్తి కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. పదోతరగతిలో ఉత్తమ ఫలితాల సాధన కోసం రాష్ట్ర విద్యాశాఖ వందరోజుల ప్రణాళిక ప్రకటించింది. డిసెంబర్ నాటికి టెన్త్ సిలబస్ పూర్తి చేయాల్సి వుంది. కానీ గురుకుల ఉపాధ్యాయుల సమ్మె, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయుల ఆందోళన కారణంగా సిలబస్ పూర్తయ్యే అవకాశాలు లేవు. సిలబస్ పూర్తి కాని పరిస్థితులు నెలకొన్నప్పుడు వందరోజుల ప్రణాళిక లక్ష్యం ఎలా నెరవేరుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పంతానికి పోతున్న పరిస్థితుల్లో గిరిజన విద్య మిథ్యగా మారుతోంది. గిరిజన విద్యలో నెలకొన్న సంక్షోభాన్ని ప్రభుత్వం చొరవ చూపి పరిష్కరించాలని గిరిజన, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

సంగంవలసలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

## క్వారీ అక్రమ తవ్వకాలపై ప్రచారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బడిదేవరమ్మకొండపై జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలు ఆపాలని కొండ రక్షణ పోరాట కమిటీ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వెంకంపేట, చినబొండపల్లి, కొత్తపట్నం, సంగంవలస, నడిమి, గదబవలస, గంగాపురం, కోరి, మడకవానివలస గ్రామాల్లో పర్యటించారు. కొండ తవ్వకాలపై కోరి గ్రామంలో ఈనెల 28 సమావేశానికి అందరూ రావాలని కోరారు. కొండ తవ్వకాలు జరిగితే ప్రజల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎం.కృష్ణమూర్తి, పి.రమణి, ఎం.భాస్కరావు, బి.నర్సింగరావు, పి.రంజిత్‌కుమార్, పి.సంగం, ఎస్.విశ్వేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కోఆర్డినేటర్‌గా గోపాలకృష్ణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతీయ మానవ హక్కుల ఫోరం జోనల్ కోఆర్డినేటర్‌గా ఇప్పిలి గోపాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం చైర్మన్ టిఎస్ రామచంద్రనాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ పదవితో మరింత బాధ్యత పెంచిందన్నారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు ఆయన్ను అభినందించారు.

### మాతృ భాష ఉపాధ్యాయ సంఘం

## రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆనందరావు, చిట్టిబాబు

ప్రజాశక్తి - సీతంపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయ సంఘం కొత్త కార్యవర్గం ఎన్నుకున్నారు. విశాఖపట్నం జగదాంబలో ఉన్న సిఐటియు కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స సీతంపేట గిరిజన సంఘ బాధ్యులు ఎం.తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలానికి చెందిన సవర ఆనందరావు రాష్ట్ర అధ్యక్షుడిగా, అల్లూరి జిల్లా పాడేరు మండలానికి చెందిన మర్రి చిట్టిబాబు ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా కె.నరన్, సవర డోంబు, బి.వెంకటేష్, బి.గౌరి, పి.శ్రీను, జి.జగన్, పి.కుమారి, కె.రమేష్, కె.కుసుమకుమారి, సహాయ కార్యదర్శులుగా సాగర్, గంగారావు, సుందర్రావు, వీరయ్య, దేవి, భారతి తదితరులను ఎన్నికయ్యారు.

ఆనందరావు

చిట్టిబాబు

## ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటాం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎప్పుడు ముందుంటారని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గరుగుబిల్లి మండలం పెద్దూరుకు చెందిన జి.ఉషారాణి ఆరోగ్య సమస్యతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సహాయం అభ్యర్థించారు. ఇందుకు స్పందించిన సిఎం వైద్య ఖర్చుల కోసం రూ.68,503 మంజూరు చేశారు. సంబంధిత చెక్కును ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అక్కేన మధుసూదనరావు, మర్రాపు పురుషోత్తం నాయుడు, అంబటి రాంబాబు, పాడి సుదర్శన్రావు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

## స్కీమ్‌వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాలకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు డిమాండ్ చేశారు. మండలంలోని సింగన్నవలసలో ఆదివారం జరిగిన స్కీం వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీం వర్కర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ఐ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం, ఐసిడిఎస్ పథకాలను ఇస్కాన్, అక్షయపాత్ర, వేదంతకు అప్పగించొద్దన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు, వేతనంలో సగం పెన్షన్, గ్రాడ్యుటీ, పిఎఫ్, మెటర్నటీ లీవు, ఇతర సామాజిక భద్రతా సౌకర్యాలను కల్పించాలని, స్కీమ్ ప్రైవేటీకరణ ఆపాలని, నూతన విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వివిధ పథకాల విస్తరణకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు భానుచందర్, కె.రాము, హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు 13 గ్రామాల్లో పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో సోమవారం 13 గ్రామాల్లో పీసా గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సమాచారంతో హాజరు కావాలన్నారు

అబాకస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

## జాతీయ అబాకస్ పోటీల్లో సాలూరు విద్యార్థులు

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 14,15 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ, జాతీయ అబాకస్ పోటీల్లో సాలూరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ జాతీయ పోటీల్లో సాలూరు నుంచి యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కోట జానకీరావు కుమారుడు కోట హేమంత్, కుమార్తె హైందవితో పాటు అక్కేన కుందన, మన్యం శ్రీజ పాల్గొన్నారు. 30 దేశాల నుంచి పోటీదారులు హాజరయ్యారు. జాతీయస్థాయి పోటీల్లో కోట హేమంత్, హైందవి, మన్యం శ్రీజ తృతీయ స్థానంలో నిలిచారు. అక్కేన కుందన ద్వితీయ స్థానంలో నిలిచింది. క్యాలిక్యులేటర్ సాయం లేకుండా కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగాహారాలను చేతివేళ్లతో చేయడమే ఈ అబాకస్ విధానం. యుసిమాస్ డైరెక్టర్ మల్లూరు స్వప్న వద్ద శిక్షణ పొందిన సాలూరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. యూనివర్శల్ కాన్సెప్ట్ మెంటల్ అండ్ అర్థమెటిక్ సిస్టంలో అబాకస్ విద్య నేర్పుతారు. వీరు జాతీయ స్థాయిలో సాలూరు పేరు నిలబెట్టి పతకాలు సాధించడంపై పలువురు వీరిని అభినందించారు.

## మల్లి గురుకుల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌కు మెమో

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లి బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వాసుదేవరావు, వైస్ ప్రిన్సిపల్ కిషోర్ కుమార్‌కు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం అన్న దొర మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. నెలరోజులుగా అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తమ పాఠశాలకు రాకపోవడంతో తమ చదువులు ఆగిపోయాయని వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ శనివారం స్థానిక ఐటిడిఎ వద్ద విద్యార్థులు ఆందోళన చేశారు. అయితే వీరు బయటకు వచ్చినందుకు గానూ ప్రిన్సిపల్, వైస్‌ప్రిన్సిపల్‌కు మెమోలు ఇచ్చినట్లు తెలిసింది.

# మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి మహిళ ఆర్థిక ప్రగతిని సాధించి, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహానందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని లుంబేసులో ఆదివారం సమగ్ర రైతు సహకార సంస్థ (ఇఫ్కో) ఆద్వర్యంలో స్వయం సేవక బృందాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇఫ్కో లాంటి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చేయూత నివ్వడం, ఆర్థిక అభివృద్ధికి దోహదపడడం సంతోషించదగ్గ పరిణామం అన్నారు. ఇఫ్కో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ, బృహత్ సంకల్పంతో అందిస్తున్న ప్రోత్సాహకాలు ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లేక వ్యాపారం చేయాలన్నా, తగు పెట్టుబడులు లేక సతమతమవుతున్న నైపుణ్యం గల పట్టణ, గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి మహిళలకు ఇది ఓ సువర్ణావకాశమన్నారు. తమ సంస్థ, సాధ్యమైనంత పేదరికాన్ని నిర్మూలించి, ఆర్థిక-అసమానతలు తొలగించి, స్వయం ఉపాధి కల్పన ద్వారా నిరుద్యోగాన్ని కొంత వరకు తగ్గించి, మహిళా పురోభివృద్ధి చేందెందేకు కృషి చేసి, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాడమే ఇఫ్కో సంస్థ ప్రధాన ఉద్దేశ్యం అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 56 వేల మహిళ బృందాలకు స్వయం ఉపాధి కల్పించామన్నారు. ప్రాజెక్టు జిల్లా మేనేజర్ అల్లు పోలినాయుడు మాట్లాడుతూ మహిళలు స్వయం సహాయక బృందాలకు మార్కెట్ రేటు కంటే తక్కువ రేటుకే 22 రకాల నిత్యావసర సరుకులు సూక్ష్మ రుణ పద్ధతి ద్వారా అందజేస్తున్నామని అందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గల పేద, మధ్య తరగతి, అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తద్వారా ఆర్థిక భారం కొంతమేర తగ్గి, సాంఘిక- ఆర్థిక జీవనం మెరుగుపడుతుందని అన్నారు. మా సంస్థ, మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేసి, ఆర్థిక ప్రగతి సాధించే దిశగా అడుగులు వేస్తుందన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశాలో మహిళల పురోభివృద్ధికి విరివిగా సేవలందిస్తుందన్నారు. అనంతరం డివిజనల్ మేనేజర్ మీనక వసంతకుమార్ సంస్థ ముఖ్య లక్ష్యాలను వివరించారు. ప్రతి మహిళ సాధికారత, సుస్థిర అభివృద్ధే మా ప్రధాన ఎజెండా అని తెలిపారు. బతుకు తెరువు కోసం వెంపర్లడే వలసవాదులకు, కుటుంబ భారంతో తాళలేక చతికిల బడుతున్నవారి జీవితాలకు ఇదో దివ్య సంజీవని అని చెప్పారు. మా సంస్థ, మహిళల స్వయం ఆర్థిక అభివృద్ధికి ఆర్థికంగా సహకరిస్తూ, వారి జీవనోపాధికి ఉపయోగపడే వివిధ రకాల వస్తు ఉత్పత్తి శిక్షణ, పరిశ్రమ స్థాపనకు పూర్తి సహకారం అందిస్తూ, మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే చేతులు మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోమండల టిడిపికన్వీనర్ పాడి సుదర్శన్ రావు, ఎంపిటిసి మండంగి గౌరమ్మ, సర్పంచ్ తోయక సీతమ్మ, ఇఫ్కో మండల ఎగ్జిక్యూటివ్ బిడ్డిక పుష్పనాథం, గరుబిల్లి మండల ఎగ్జిక్యూటివ్ టి.శంకరరావు, పార్వతీపురం మండల ఎగ్జిక్యూటివ్ బి.జనార్ధన ఉన్నారు.

గిరిజనులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

## టైఫాయిడ్, మలేరియాతో వ్యక్తి మృతి

### కుమారుడి పరిస్థితి ఆందోళనకరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని సెగిడి వీధికి చెందిన ఉండ్రాల హరిబాబు (35) టైఫాయిడ్, మలేరియా జ్వరంతో ఆదివారం శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హరిబాబుకు ఈనెల 16న తీవ్ర జ్వరం రావడంతో నడుకూరు గ్రామ సమీపంలో గల కనుష ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఎప్పటికీ జ్వరం తగ్గుముఖం పట్టకపోవడంతో ఈనెల 19న వీరఘట్టంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యాధికారి సలహా మేరకు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యాధికారులు సమాచారం అందించినట్లు తెలిపారు. హరిబాబుకు రెండేళ్ల కుమారుడు విష్ణువర్ధన్‌రాజు కూడా మలేరియా, టైఫాయిడ్ జ్వరం రావడంతో ప్రస్తుతం శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతి చెందన హరిబాబుకు భార్య హిమశ్రీ ఉన్నారు.

మృతి చెందిన హరిబాబు

## పర్యావరణాన్ని పరిరక్షించేందుకు సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి - సాలూరురూరల్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అప్పుడే భావితరాలకు ఆరోగ్యమైన వాతావరణాన్ని అందించగలమని తమిళనాడుకు చెందిన ముత్తు సెల్వాన్ తెలిపారు. ఈయన సైకిల్‌పై ప్రపంచ యాత్ర చేసి సుమారు 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేస్తున్నాడు. ఈ మేరకు ఆదివారం మామిడిపల్లి వద్ద 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ నేడు ప్రపంచం మొత్తం అభివృద్ధి చెందటానికి భూమి, నీరు, గాలి తదితరమైనవి నచ్చేలా వాడుకుంటున్నారని దీని ద్వారా వాతావరణం కలుషితం అవుతుందని, మానవాళి బాగుకోరి నా వంతుగా ఈ సైకిల్ యాత చేపడుతున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ 5 లక్షల మొక్కలను నాటించానన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

శ్రీనివాస రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## విద్యార్థులకు స్ఫూర్తి రామానుజన్

ప్రజాశక్తి - కురుపాం

నేటి విద్యార్థులు గణిత మేధావి శ్రీనివాస్ రామానుజన్ స్ఫూర్తిగా తీసుకొని అపూర్వమైన విజయాలు సాధించాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు అన్నారు. ఆదివారం శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో అసంఖ్యాక ఆవిష్కరణలతో భారతదేశ గర్వించదగ్గ మేధావిగా పేరు తెచ్చుకున్నారని, ఆయన్ను ఆదర్శంగా నేటి విద్యార్థులు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇజ్జు జగదీశ్వరరావు, సంతోష్ కుమార్ పండా, బరాటం ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

**గుమ్మలక్ష్మీపురం** : భారత గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రాన్ని జయమ్మవలస మండలం రావాడ- రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు గీశారు. రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని వేసినట్లు తెలిపారు. దేశ నాయకులు, శాస్త్రవేత్తలు, ప్రముఖుల జయంతిని సందర్భంగా వారి చిత్రాలను గీయడం అలవాటుగా మార్చుకున్నారు.

కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

## మురుగు కాలువలను శుభ్రపరచండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రెండో వార్డులో గల కాలనీల్లో మురుగు కాలువలు శుభ్రం చేయాలని సిపిఎం పట్టణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆ వార్డులోని పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వెంకటేశ్వర కాలనీ నుంచి ఎన్‌పి అగ్రహారం (కొత్తవీధికి) వెళ్లే మురుగుకాలువలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు వెళ్లేందుకు దారి లేక దుర్గంధం వెదజల్లుతుండడంతో నివాస ప్రాంతాల ప్రజలు దోమలతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీంతో వ్యాధుల బారిన పడే అవకాశం ఉందనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ ప్రజారోగ్య విభాగ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు వి.ఇందిర, రెడ్డి శ్రీదేవి, ఎం.గౌరమ్మ, గెద్ద తులసి, పాకల సన్యాసిరావు, సంచాన ఉమా, బంకురు సూరిబాబు, మంత్రపూడి వెంకటరమణ, కడ్రక రామస్వామి అన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు

## పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. పెరిగిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరుతూ విద్యుత్ బిల్లులు దగ్ధం చేస్తూ శివదవలసలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీకి అధిక మొత్తంలో ఆదాయాన్ని కట్టబెట్టేలా విద్యుత్ సంస్కరణలు తెచ్చి పేద ప్రజలపై విద్యుత్ భారాలు పెంచే పరిస్థితి ఉందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచిన సందర్భంలో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు తాము అధికారంలోకి వస్తే విద్యుత్‌చార్జీల పెంచమని హామీ ఇచ్చారని అన్నారు. అయితే ఈ హామీని తుంగలోకి తొక్కి సర్దుబాటు చార్జీలు, ట్రూ ఆఫ్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల బిగించి విపరీతమైన విద్యుత్ ఛార్జీలు పెంచే పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ భారాలు ప్రజలపై ఎక్కువ మోతాదులో పెంచే పరిస్థితి ఉందని, కావున వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటికి, కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగించే పద్ధతి విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి ప్రజల పైన భారాలు ఆపాలని, అలాగే దళితులకు, గిరిజనులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇచ్చి అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. లేదంటే పోరాటం ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కామయ్య, చిలకమ్మ, సుబ్బమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.

## రంగుమారిన ధాన్యాన్ని కొనాలి

**బొబ్బిలి** : వర్షాలకు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు రోజులు కురిసిన వర్షాలకు పరిసరాల్లో, కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసి పోయాయని, తడిసిన ధాన్యాన్ని, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు ఆదుకోవాలని కోరారు.

## విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అధిక శాతం విద్యార్థులు ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించేందుకు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ ప్రోత్సహించడం అభినందనీయమని రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) అన్నారు. మండలంలోని రావుపల్లి జెడిపి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ అందజేసిన స్టడీ మెటీరియల్ పంపిణీలో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడారు. స్వగ్రామాభివృద్ధికి సూర్యప్రకాష్ ఉన్న మమకారంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇటీవల గ్రామంలో దాదాపు 23 మంది నిష్ణాతులైన వైద్యులచే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించి ఇటు గ్రామస్తులు, అటు పరిసర గ్రామాల ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న వైద్యులు సూర్యప్రకాష్, సర్పంచ్

# రైతులకు సిరులు కురిపిస్తున్న కంద

ప్రజాశక్తి - సాలూరురూరల్

ముఖ్యమైన వాణిజ్య పంటల్లో కంద ఒకటి. ఈ ఏడాది సాగు చేసిన రైతుకు ఈ పంట సిరులు కురిపించింది. అన్నదాత ఎన్నడూ పొందని ధర అందుకొని సంతోషంతో ఉన్నారు. అలాగే వాతావరణం కూడా అనుకూలించడంతో ఈ పంట ఎక్కువ దిగుబడులను ఇచ్చింది. ఈ కందను ప్రధానంగా కూరలు, చెట్నీలు, పిండి తయారీల్లో వినియోగిస్తారు. కందను ఎక్కువగా బెంగాల్, మహారాష్ట్ర ప్రజలు ఇష్టపడతారు. ఈ పంట ఎక్కువగా ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రైతులు సాగుచేస్తుంటారు. ఈ ఏడాది వాతవరణం అనుకూలించడంతో అధిక దిగుబడులు సాధించి ఎక్కువ మొత్తంలో లాభాలు చూవిచూశారు. అదే ప్రాంతానికి చెందిన రైతుల బంధువులు ఈ ప్రాంతంలో ఉండడంతో ఈ పంట సాగుపై ఇక్కడి రైతులు మొగ్గ చూపారు. ఈ పంటకు మార్కెట్‌లో అత్యధికంగా ధర పలకడంతో దీన్ని ఇక్కడి రైతులు కూడా సాగుచేస్తున్నారు.

**సాగు చేసే విధానం**

ఈ పంటను మే నెలలో నాటుకోవాలి. పొలాలు బాగా దుక్కులు వేసుకొని, ఎకరాకు పది టన్నుల పశువుల ఎరువును చివరి దుక్కులో వేసుకోవాలి. సాలు సాలుకు 60 సెంటీమీటర్ల దూరం ఉండాలి. నాటినప్పుడు నీరు తడి చేయాలి. దుంపలా కాకుండా 300 గ్రాములు ఉండేలా దుంప కోసి కన్ను వుండే విధంగా కటింగ్ చేసి దుంప దుంపకు 45 సెంటీమీటర్ల దూరం వుండేలా నాటుకోవాలి. నాటిన అనంతరం కలుపు మందును స్ప్రే చేయాలి. ప్రధానంగా ఈ పంట మధ్యలో భూమి ఖాళీ ఉండడం వల్ల గడ్డి ఎక్కువగా పుట్టే అవకాశం ఉంటుంది. అది రాకుండా ఎప్పటికప్పుడు కలుపు

ఏజెన్సీలో సాగవుతున్న కంద పంట

తీసుకోవాలి. మొక్క మొలకెత్తిన తర్వాత తడి ఆరకుండా నీరందించాలి. ప్రతి 40, 80, 120 రోజులకొకసారి భాస్వరం, నత్రజని, పొటాష్ ఎరువులను వేసుకోవాలి. చీడ పురుగుల నివారణకు మందులను పిచికారి చేసుకోవాలి. ఎకరానికు 18 నుండి 20 పుట్లు (250) కేజీల వరకు వేయాలి. ఇది ఒక పుట్టు వచ్చేసరికి రూ.11,500 వరకు ఉంటుంది. అంటే సుమారు రూ.2 లక్షల వరకు విత్తన ఖర్చు అవుతుంది, ఇది 6 నుండి 7 నెలల పంట. దీన్ని తీసేశాక మరో పంటను కూడా వేసుకోవచ్చును. ఈ పంటను జాగ్రత్తగా సాగు చేసినట్లయితే ఎకరాకు 90 నుండి 100 పుట్లు పంట చేతికి వస్తుంది. దీని ద్వారా రైతుకు ఎకరాకు రూ.9లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

### అధిక ఆదాయం వచ్చింది

గత ఐదేళ్ల నుంచి నేను కంద పంట సాగుచేస్తున్నాను. ఏ ఏడాదీ ఇంత ధరకు అమ్మలేదు. ఈ సంవత్సరం నేను రెండు ఎకరాల్లో ఈ పంటను సాగు చేశాను. అందులో వచ్చే ఏడాదికి అర ఎకరా విత్తనం ఉంచుకున్నాను. 1.5 ఎకరా కందను అమ్మగా రూ.14 లక్షలు ఆదాయం వచ్చింది.

**- గొర్లె పోలి నాయుడు మామిడిపల్లి**

### చిన్నకారు రైతులకు అండ

గతంలో ఎకరా కంద సాగు చేశారు. ఈ పంటను వచ్చే ఏడాదికి నా అవసరానికి వుంచుకొని, మిగతాది అమ్మగా రూ.6 లక్షలు ఆదాయం వచ్చింది. మా లాంటి చిన్నకారు రైతులు ఈ ఏడాది కంద పంట ఆర్థికంగా ఎంతో అండగా ఉంది. ఇటువంటి పంటలను సాగు చేస్తే ఐదేళ్లలో రైతే రాజు అన్నది నిజం అవుతుంది.

**- కనకల రమణ, కురుకూటి**

# రోడ్ల మరమ్మతులు ఎప్పటికి?

ప్రజాశక్తి పార్వతీపురం టౌన్

పట్టణ నడిబొడ్డున ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులను ఎప్పుడు పూడ్చుతారని సిపిఎం నాయకులు ప్రజా ప్రతినిధులను, ఆర్అండ్‌బి అధికారులను ప్రశ్నిస్తున్నారు. శనివారం రాత్రి పట్టణంలోని ప్రధాన రహదారిలో అధ్వాన్నంగా మారిన రాయగడ రోడ్డు మీదుగా వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిని సిపిఎం నాయకులు వి.ఇందిర, ఆర్ శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, పాకల సన్యాసిరావు, సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు, బివి రమణ, పి.రాజశేఖర్, తదితరులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ రహదారులపై ప్రయాణించాలంటే పాదచారులకు, వాహనదారులకు నరకంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనప్పటికీ రోడ్ల మరమ్మతులపై చర్యలు నత్తనడకలా సాగుతున్నాయన్నారు. సంక్రాంతి నాటికి రోడ్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్న ప్రభుత్వ పెద్దల ఆర్భాట హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో పాటు,

పార్వతీపురం ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గొయ్యిలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పాత బస్టాండ్ సమీపాన గల రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా ఉందని, కనీసం మరమ్మతులు చేసేందుకు కూడా ఆర్అండ్‌బి అధికారులు సిద్ధపడకపోవటం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పుతున్నప్పటికీ కింది స్థాయిలో ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరమని, ఇప్పటికే అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురై మరణిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే పట్టణంలోని రోడ్లకు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని, లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో రోడ్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. సీతానగరం బజార్లో వ్యాపారులకు, ప్రజలకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. అలాగే వాహనదారుడు తప్పక లైసెన్సు, హెల్మెట్ ధరించాలన్నారు. కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రయాణికులను పరిమితికి మించిన డ్రైవర్లు ఎక్కించరాదని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

సీతానగరంలో వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

**డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి**

**సీతంపేట** : వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సీతంపేట ఎస్సై వై అమ్మనరావు అన్నారు. ఆదివారం సంత మార్కెట్ సమీపంలో అవగాహన యువతకు ప్రజలకు కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపితే తప్పనిసరిగా హెల్మెట్ ఉండాలన్నారు. హెల్మెట్ తలకు రక్షణ కవచంలా ఉపయోగపడుతుందన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనం ఇస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్‌తో పాటు లైసెన్స్, సి-బుక్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని అవగాహన కల్పించారు. ట్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కొత్తగూడ ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, నాయకులు బి.అనిల్ సందర్శించారు. ఆరో తరగతి విద్యార్థి సుశాంత్‌పై చేయి చేసుకున్న వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల నుంచి విద్యార్థులు బయటకు వెళ్లకుండా హెచ్ఎం, వార్డెన్ చూడాలని కోరారు. స్కూల్ చుట్టుపక్కల ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు బయటకు వెళ్లిపోతున్నారని, బయట నుంచి విషసర్పాలు లోపలికి వస్తున్నాయని అన్నారు. పొరపాటున విద్యార్థులకు జరగరానిది ఏమైనా జరిగితే దానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఓ ప్లాంట్ మోటార్ రిపేర్ చేయాలన్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

రోడ్డు మధ్యలో స్తంభాన్ని ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నగరంలోని వై-జంక్షన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ కథనం ప్రకారం...

నగరంలోని విటి అగ్రహారానికి చెందిన శ్రీపతి మురళీకృష్ణ (60) ఆదివారం ఉదయం బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి, తిరిగి వస్తున్నాడు. వై-జంక్షన్ వద్ద రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆయన్ను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య చంద్రకళ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల పెద్దమ్మాయికి వివాహమైంది. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు.

## తల్లిదండ్రులకు పాఠశాలలో అనుమతి ఇవ్వాలి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థినిలను చూడ్డానికి వారి తల్లిదండ్రులకు అనుమతి ఇవ్వాలని విద్యా కమిటీ చైర్మన్ ఊయక సుమలతకు తల్లిదండ్రులు వినతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం బాలికల గురుకుల పాఠశాల లోపలికి పంపించలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పూట తల్లిదండ్రులు వచ్చి పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటారని, కావున పాఠశాల యాజమాన్యం లోపలికి పంపించకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాటు విద్యార్థులకు అవసరమైన వస్తువులు కూడా ఇవ్వడానికి కష్టమవుతుందని చెప్పారు. కావున విద్యార్థుల తల్లిదం డ్రులకు ఆదివారం పాఠశాల లోపలికి ప్రవేశం కల్పించాలని కోరారు.

## తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - వీరఘట్టం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు తడిసిపోవడంతో వాటిని ఆరబెట్టే పనిలో అన్నదాతలు ఉన్నారు. మండలంలోని యు.వెంకంపేటకు చెందిన రైతులు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఆరుగాలం కష్టించి శ్రమించిన పంట నాశనమైపోతుందన్న భయంతో నెట్టివేసిన ధాన్యాన్ని పరదాలపరిచి వాటి పైన ధాన్యాన్ని ఆరబెట్టినట్లు చెబుతున్నారు. అంతేకాకుండా సొసైటీకి 80 పరదాలు వచ్చాయని, అవసరమైన వారికి ఇవ్వకుండా అవసరం లేని వారికి పంపిణీ చేసినట్లు అన్నదాతలు ఆరోపిస్తున్నారు. పండిన పంటను కాపాడుకునేందుకు పరదాలు అద్దెకి తెచ్చి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

కళ్లాల్లో ధాన్యం ఎండబెడుతున్న రైతులు

## జంఝావతి పూర్తికి సిపిఎం సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి రిజర్వాయర్ పూర్తిచేసేలా ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి చేస్తున్న ప్రాజెక్ట్ నిర్మాణ సాధన యాత్రకు సిపిఎం సంపూర్తిగా మద్దతు తెలుపుతోందని ఆ పార్టీ నాయకులు కొల్లి సామ్మూర్తి అన్నారు. మండల కేంద్రంలో రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. గడిచిన కొన్ని రోజుల క్రితం కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం జంఝావతి రిజర్వాయర్‌ను పూర్తిచేసే దిశగా నాలుగు నెలల క్రితం పరిశీలన చేసిందన్నారు. అనంతరం భవిష్యత్తులో ఈ రిజర్వాయర్ పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులంతా కలిసి అటు ఒడిశా ప్రభుత్వంతో చర్చలతో పాటు ఇటు కేంద్ర ప్రభుత్వం నుండి తగిన నిధులు వచ్చేలా కూటమి నాయకులు సమావేశంలో చెప్పారన్నారు. అయితే కూటమి నాయకులతో పాటు మిగతా ప్రజాసంఘాలు, పార్టీల నాయకులతో కలిసి జంఝావతి సాధన కమిటీ వేసేలా కూటమి నాయకులు చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. రోజులు గడుస్తున్నా కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు ఆదిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లని పరిస్థితి ఉందని అన్నారు. కావున వెంటనే కూటమి నాయకులు జంఝావతి రిజర్వాయర్ పనులు ఒడిశా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి వేగవంతంగా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జంఝావతి సాధన కమిటీ ఆధ్వర్యంలో సాగుతున్న దశల వారీ పోరాటం ఉధృతం కాకముందే కూటమి నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

## 300 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్న గోరపాడు సమీపంలో సారా తయారీ కేంద్రంపై ఎస్సై వై.అమ్మన్నరావు ఆదివారం దాడి చేసి 300 లీటర్ల బెల్లం ఊటలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సారా తయారీ కేంద్రాలపై దాడులు తప్పవని హెచ్చరించారు. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు. సారా రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. సారా తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని చెప్పారు. ఎస్ఐతో పాటు పోలీసులు ఉన్నారు.

తడిసి రాలిపోతున్న పత్తి

# తడిసి ముద్దయిన పత్తి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి సీజన్లోనూ రైతు కష్టపడి పండించిన పంట చేతికే అందిస్తున్న సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో ప్రతిసారి నష్టపోతున్న విషయం చూస్తూనే ఉన్నాం. ఈ ఖరీఫ్ సీజన్లో వరి పంటకు వర్షాల వల్ల అంత ముప్పు లేకపోవడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే పత్తి రైతులను తుఫాన్ రూపంలో తీవ్రంగా నష్టపరిచే పరిస్థితి ఏర్పడింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా మండలంలో ఏకధాటిగా కురిసిన వర్షానికి పత్తి పూర్తిగా తడిసిపోయి నష్టం ఏర్పడింది. వారం రోజుల క్రితం పత్తి కొంతమేరకు దిగుబడి వచ్చినప్పటికీ పొలాల్లోంచి కొంతమేరకే పంటతో ఇంటికి తీసుకెళ్లారు. మండలంలోని 3,140 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. ఈ వర్షాలకు సుమారు 300 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని రైతులు చెబుతున్నారు. మండలంలో చోళ్లపదం, కూనేరు, గుమడ, కొమరాడ, దేవుకోన, పూడేసు, మసిమండ, లంజి పెద్దశేఖ, కుంతేను తదితర గ్రామాల్లో పత్తి పూర్తిగా పేలిపోయింది. పొలాల్లోంచి పంటను ఇంటికి తీసుకెళ్లలేదు. ఈ సమయంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో పూర్తిగా తడిసి ముద్దయిపోయింది. ప్రభుత్వ గిట్టుబాటు ధర రూ.7500 పైగా ఉన్నప్పటికీ మండలంలోని మైదాన ఏజెన్సీ ప్రాంతాల్లో దళారులు చేతిలో రైతులు దగా పడి రూ.6వేలు నుంచి రూ.6300 కొనుగోలు చేశారు. మరోవైపు సగానికి పైగా పొలంలోనే పంట ఉండడంతో వర్షానికి తడిసిపోవడంతో పత్తి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడిసిపోయిన పంటను దళారులు తక్కువ ధరకు అడుగుతారని ప్రభుత్వం స్పందించి తడిసిపోయిన పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.

## వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో కర్రివలస గ్రామ సమీపాన గల కారిగడ్డపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన 20 రోజుల క్రితం ఒక్కసారిగా కుప్ప కూలిపోయింది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాకపోకలకు వీలుగా తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినప్పటికీ గత మూడు రోజులు ఏకధాటిగా కురిసిన వర్షాలకు మట్టి జారిపోవడంతో గ్రామానికి రావాల్సిన స్కూల్ బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కర్రివలస గ్రామస్తులు కోరుతున్నారు.

విజయరామరాజు కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

## తాగునీరు వృథా

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని కొత్తవలస 9వ వార్డు పరిధిలో గల విజయరామరాజు కాలనీలో ఆదివారం కుళాయిలు ద్వారా తాగునీటి సరఫరా జరుగుతున్న సమయంలో తాగునీరు సరఫరా చేసే వాల్ నుండి ఏర్పడిన లీకు వల్ల రహదారి పై నుంచి తాగునీరు మురుగు కాలువలోకి వృథాగా పోతుంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలనీకి తాగునీరు సరఫరా చేసే వాల్‌కు మున్సిపల్ తాగునీటి సరఫరా చేసే ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పలుమార్లు మరమ్మతులు చేసినప్పటికీ పరిస్థితి యథాతథంగా ఉంది. ఈ సమస్య పరిష్కారానికి ఆ వార్డు పరిధిలో గల సచివాలయ ఇమ్యూనిటీ కార్యదర్శి పర్యవేక్షణ చేసి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## పర్యాటక సంస్థ డివిజనల్ మేనేజర్‌గా జగదీష్

ప్రజాశక్తి-విజయనగరం

పర్యాటక అభివృద్ధి సంస్థ విశాఖ ప్రాంతీయ డివిజనల్ మేనేజర్‌గా విభిన్న ప్రతిభా వంతులు, సీనియర్ సిటిజన్ల శాఖ ఎడి జి.వి.బి.జగదీష్ నియమితులయ్యారు. పర్యాటక అభివృద్ధి సంస్థకు సంబంధించి ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లో కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించనున్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులుగా ఆయన జిల్లాలో అందించిన సేవలకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సహకారంతో మెగా శిబిరాలు నిర్వహించారు. జిల్లాలో ఒకేసారి 2,338 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.3.25 కోట్లు విలువ చేసే బ్యాటరీతో నడిచే మోటార్ సైకిళ్ళు, ఇతర ఉపకరణాలను రాష్ట్రంలోనే మొదటి సారిగా అందించారు.